క్లుప్తంగా

నేడు మంత్రి పర్యటన

హుస్నాబాద్: హుస్నాబాద్‌లో రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం పర్యటించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ మల్లికార్జున్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పట్టణంలోని 3, 4, 5, 18వ వార్డుల్లో రూ.2కోట్ల వ్యయంలో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రైనేజీల పనులకు మంత్రి శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న అధికారులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నదే సెర్ప్ లక్ష్యమని డీపీఎం వాసుదేవ్ అన్నారు. మండల కేంద్రంలోని ఐకేపీ కార్యాలయంలో మహిళ సమాఖ్య సభ్యులకు బుధవారం వ్యాపారంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలను వ్యాపార వేత్తలుగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రుణాలు అందిస్తున్నాయన్నారు. ప్రభుత్వాలు అందిస్తున్న సబ్సిడీ రుణాలను సద్వినియోగం చేసుకుని వ్యాపారంలో రాణించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎం కిరణ్, ఆనంద్, ప్రసాద్‌రావు, సీసీలు, సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థి రాజశేఖర్‌తో నాయకులు

దుబ్బాకటౌన్: మద్దూరులో నిర్వహించిన అండర్-19 హ్యాండ్ బాల్ రాష్ట్రస్థాయి పోటీల్లో దుబ్బాక మైనార్టీ గురుకుల పాఠశాల విద్యార్థి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ విమలారెడ్డి బుధవారం తెలిపారు. ఉమ్మడి జిల్లా నుంచి 200 మంది క్రీడాకారుల హాజరుకాగా గురుకుల కళాశాల ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థి రాజశేఖర్ రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపికయ్యాడని చెప్పారు. అతడిని కో-ఆర్డినేటర్ మెహరాజ్, హమీద్, షాదుల్ ఖాజా పాషా, తదితరులు అభినందించారు.

టీకాలు తప్పనిసరి



పశువును పరీక్షిస్తున్న వైద్యాధికారి శ్వేత

జగదేవ్‌పూర్(గజ్వేల్): పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకుని, ప్రతి రైతు పాడి దిగుబడితో ఆర్థిక అభివృద్ధి సాధించాలని పశు వైద్యాధికారి శ్వేత సూచించారు. మండలంలోని తిగుల్ గ్రామంలో బుధవారం ఉచిత పశువైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి పశువుల్లో వచ్చే గర్భాశయ, దూడల మరణాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అదే విధంగా సీజనల్ వ్యాధులు రాకుండా టీకాలను వేయించాలని చెప్పారు. 147 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వీఏ శ్రీనివాస్, గోపాలమిత్ర సూపర్‌వైజర్ భాస్కర్, యాదగిరి, స్వామి, గౌరి తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఇళ్ల నమోదు

అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేటఅర్బన్: ఒక్క ఇల్లు విడిచిపెట్టకుండా పకడ్బందీగా ఇళ్ల వివరాలను నమోదు చేసి ప్రతీ ఇంటికి స్టిక్కర్ అంటించాలని ఎన్యూమరేటర్లకు, సూపర్‌వైజర్లకు అడిషనల్ కలెక్టర్ అబ్దుల్ హమీద్ సూచించారు. సిద్దిపేట అర్బన్ మండలం ఎన్సాన్‌పల్లిలో బుధవారం నిర్వహించిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వెంట సిద్దిపేట ఆర్డీఓ సదానందం, అర్బన్ తహసీల్దార్ సలీం ఉన్నారు. అనంతరం నంగునూరు మండలం ముండ్రాయిలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక, రాజకీయ, కుల సర్వేను పరిశీలించారు.

అందమైన చేతిరాతతో ఎంతో మేలు: ఎంఈఓ

దుబ్బాకటౌన్: అందమైన చేతిరాతతో విద్యార్థులకు భవిష్యత్‌లో ఎంతో మేలు జరుగుతుందని మండల విద్యాధికారి జోగు ప్రభుదాస్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని ధర్మాజీపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జిల్లా చేతిరాత నిపుణుడు ఏజాజ్ అహ్మద్ బుధవారం విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం 'అందమైన చేతిరాత అందరికీ సాధ్యమే' అనే పుస్తకాన్ని ఆవిష్కరించారు.

చౌక ధరలకే ఆర్టీసీ అద్దె బస్సులు

సిద్దిపేటకమాన్: శుభకార్యాలు, వివాహాలకు ఆర్టీసీ పల్లెవెలుగు, ఎక్స్‌ప్రెస్, డీలక్స్ లాంటి అన్ని రకాల అద్దె బస్సులపై ధరలు తగ్గించినట్టు డిపో మేనేజర్ సుఖేందర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లో ఇబ్బందులు ఉండొద్దు



గజ్వేల్: కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి

గజ్వేల్/ములుగు(గజ్వేల్)/సిద్దిపేటఅర్బన్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూడాలని ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి నిర్వాహకులకు సూచించారు. మండలంలోని ధర్మారెడ్డిపల్లి, బయ్యారం, బెజుగామ, బూరుగుపల్లి, దిలాల్‌పూర్, దాచారం, పిడిచెడ్, శేర్‌పల్లి, కొడకండ్ల గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు తమ ధాన్యాన్ని దళారులకు అమ్మవద్దని, కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధర పొందాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఎదురైతే సంబంధిత అధికారులకు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల సహకార సంఘం చైర్మన్ వెంకటేశ్‌గౌడ్, గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ తదితరులు పాల్గొన్నారు. ములుగు మండలంలోని సింగన్నగూడ, ములుగు, నర్సాపూ ర్, తున్కిబొల్లారం, క్షీరసాగర్, కొట్యాలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్ ప్రవీణ్‌రెడ్డి ప్రారంభించారు. కేంద్రాలలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఎంపీడీఓ శర్మ, మండల వ్యవసాయ అధికారి ప్రగతి, పీఏసీఎస్ సీఈఓ రమేశ్‌బాబు, పీఏసీఎస్ డైరెక్టర్లు రాములుగౌడ్, రమేశ్, శ్రీనివాస్‌రెడ్డి నాయకులు శ్రీనివాస్‌గుప్త, బాల్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డి, మల్లేశ్‌యాదవ్ పాల్గొన్నారు. ఎన్సాన్‌పల్లిలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని మాజీ వైస్ ఎంపీపీ అల్లం ఎల్లంతో కలిసి మాజీ సర్పంచ్ బొల్లం రవీందర్‌గౌడ్ ప్రారంభించారు. రైతులు తమ ధాన్యాన్ని కల్లాల వద్దనే ఆరబెట్టుకొని తీసుకురావాలని సూచించారు. మాజీ ఎంపీటీసీ స్రవంతి ప్రశాంత్ పాల్గొన్నారు.

మద్దతు ధర పొందండి..

తొగుట(దుబ్బాక): ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి కనీస మద్దతు ధర పొందాలని డీఆర్‌డీఓ జయదేవ్ రైతులకు సూచించారు. తుక్కాపూర్, బండారుపల్లిలో కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ప్రైవేట్ వ్యాపారులకు ధాన్యం విక్రయించి రైతులు నష్టపోవద్దని సూచించారు. అధికారులు, రైతు లు సమన్వయంతో వ్యవహరించి కొనుగోలు సజావుగా సాగేలా చూడాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం రైతుల నుంచి పూర్తిస్థాయిలో ధాన్యం కొనుగోలు చేస్తుందని తెలిపారు. అనంతరం తొగుటలో నిర్వహిస్తున్న సమగ్ర కులగణనను పరిశీలించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోండి

రూరల్‌సీఐ శ్రీను



నంగునూరు(సిద్దిపేట): మాట్లాడుతున్న సీఐ శ్రీను

నంగునూరు(సిద్దిపేట): చట్టాలపై ప్రతి ఒక్కరు అవగాహన పెంచుకోవాలని రూరల్‌సీఐ శ్రీను ప్రజలకు పిలుపునిచ్చారు. మంగళవారం రాత్రి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో మండంలోని ఘణపూర్‌లో కనువిప్పు కార్యక్రమం నిర్వహించారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు రోడ్లపై ధాన్యం ఆరబోయడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో రాజగోపాల్‌పేట ఎస్‌ఐ ఆసీఫ్, రాజు, తిరుమల, రాజేశ్, భాస్కర్, యాదగిరి, నర్సింహులు, బాబు, మంజుల, రాజమణి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



కొండపాక(గజ్వేల్): మాట్లాడుతున్న ఎస్‌ఐ శ్రీనివాస్

బెజ్జంకి(సిద్దిపేట)/కొండపాక(గజ్వేల్): విద్యార్థులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ కృష్టారెడ్డి సూచించారు. సైబర్ జాగృతి దివాస్‌లో భాగంగా బెజ్జంకిలోని సత్యసాయి గురుకుల పాఠశాలలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అపరిచితుల ఫోన్‌కాల్స్, అలాగే వివిధ గేమ్‌లకు సంబంధించిన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకొనే ముందు చాలా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. సెల్‌ఫోన్‌ల ద్వారా సైబర్ నేరాల తీరును వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు చదువుపైనే దృష్టి సారించాలని కుకునూరుపల్లి ఎస్‌ఐ శ్రీనివాస్ సూచించారు. మండలంలోని లకుడారం హైస్కూల్లో బుధవారం డ్రగ్స్, తదితర మత్తు పదార్థాల వినియోగం, సైబర్ నేరాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ దేశ భవిష్యత్ యువత చేతుల్లో ఉందన్నారు. యువత మత్తు పదార్థాలకు అలవాటు పడి విలువైన జీవితాలను నాశనం చేసుకోవద్దని, సోషల్ మీడియాలో వచ్చే అసత్య సమాచారాలను నమ్మొద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరస్పర సహకారంతో అధిక దిగుబడులు

మండల వ్యవసాయాధికారి శ్రీనాథ్



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న ఏఓ శ్రీనాథ్

సిద్దిపేటఅర్బన్: ఆయిల్‌పామ్ సాగులో ఎదురయ్యే ఇబ్బందులు, మెలకువలను రైతులు ఒకరికొకరు పంచుకుంటూ... పరస్పర సహకారంతో అధిక దిగుబడులు సాధించవచ్చని మండల వ్యవసాయాధికారి బి.శ్రీనాథ్ రైతులకు సూచించారు. మండలంలోని బక్రిచెప్యాల గ్రామంలో ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులతో బుధవారం క్షేత్రస్థాయిలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఉన్నతమైన సాగు విధానాలను పాటిస్తూ మంచి దిగుబడులు సాధించాలన్నారు. ఆయిల్‌పామ్ సాగులో అవసరమైన పనిముట్లు కస్టమ్ హైరింగ్ సెంటర్ ద్వారా సమకూర్చుకుంటామని, అందుకు ఆర్థికంగా సహకారం అందేలాగా అధికారులు ప్రభుత్వానికి సూచించాలని రైతులు కోరారు. కార్యక్రమంలో ఏఈఓ రాజేశ్, ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ కీర్తన, రైతులు రాజిరెడ్డి, రఘురాములు, సిద్దిరాములు, శ్రీహరి, సుధీర్‌రెడ్డి, చంద్రం, అనిల్ పాల్గొన్నారు.

సమగ్ర నమోదుతో ఉత్తమ ఫలితాలు

జెడ్పీ సీఈఓ రమేశ్



బెజ్జంకి(సిద్దిపేట): సర్వేను పరిశీలిస్తున్న రమేశ్

బెజ్జంకి(సిద్దిపేట)/తొగుట(దుబ్బాక)/మిరుదొడ్డి(దుబ్బాక)/కొమురవెల్లి(సిద్దిపేట)/సిద్దిపేటకమాన్: మండలంలోని రేగులపల్లెలో కులగణన సర్వేను సిద్దిపేట జెడ్పీ సీఈఓ రమేశ్ బుధవారం పరిశీలించారు. కుటుంబాల వివరాల సేకరణను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సమగ్రంగా గుర్తించి, పూర్తి వివరాలు నమోదు చేస్తే ఉత్తమ ఫలితాలు వస్తాయన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ ప్రవీణ్, సూపర్‌వైజర్ అంజయ్య, ఎన్యూమరేటర్‌లు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కులగణనకు ప్రజలు సహకరించాలని తొగుట తహసీల్దార్ శ్రీకాంత్ కోరారు. తన కార్యాలయంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 75 మంది ఎన్యూమరేటర్లు, ఎనిమిది మంది సూపర్‌వైజర్లు సర్వేలో పాల్గొంటున్నారన్నారు. మల్లన్న సాగర్ నిర్వాసిత గ్రామాల్లో కూడా సర్వే నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రజలు ఆధార్, రేషన్ కార్డు, పాస్‌బుక్ తదితర వివరాలను అధికారులకు అందజేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వేను మిరుదొడ్డి మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో బుధవారం అధికారులు ప్రారంభించారు. కార్యక్రమంలో భాగంగా అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొని హౌజ్ లిస్టింగ్ సర్వే నిర్వహించారు. ఆయా గ్రామాల్లో చేపట్టిన సర్వేను తహసీల్దార్ హరికిషన్, ఎంపీడీఓ గణేశ్‌రెడ్డి పరిశీలించారు. టీచర్లు సర్వేలో పాల్గొనడంతో మధ్యాహ్నం నుంచి ప్రాథమిక పాఠశాలలు మూతబడ్డాయి. కొమురవెల్లి మండలంలోని గురువన్నపేటలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ సర్వే ప్రారంభించారు. మండల వ్యాప్తంగా 4,805 నివాస గృహాలు ఉండగా 42 మంది ఎన్యూమరేటర్లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి ఎస్‌కే అహ్మద్, ఎంపీడీఓ కుమారస్వామి, డిప్యూటీ తహసీల్దార్ వేణుగోపాల్‌రావు, ఎంపీఓ శ్రీనివాస వర్మ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ముదిరాజ్ సంఘం నాయకులు మాట్లాడుతూ సర్వేలో ముదిరాజులు పేరు చివరన ముదిరాజు అని నమోదు చేసుకోవడం వల్ల ముదిరాజుల సంఖ్య తెలుస్తుందన్నారు. నర్సింహులు, శ్రీశైలం, సాయి, సిద్దిరాములు, రాజు, రవి, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్యులకు హరీశ్‌రావు అభినందనలు



హరీశ్‌రావుకు పుష్ప గుచ్ఛం అందజేస్తున్న వైద్యులు

సిద్దిపేటజోన్: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు బుధవారం సాయంత్రం మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన గైనికాలజిస్ట్ అసోసియేషన్ సభ్యులను హరీశ్‌రావు అభినందించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో సీనియర్ వైద్యులు గాయత్రి రవీంద్రనాథ్, సుగుణ సతీశ్, రమాదేవి రామచందర్, మంజూష శివనందం, అసోసియేషన్ అధ్యక్షుడు అశోక్ కుమార్, ఉపాధ్యక్షులు అరుణ, శైలజ, ప్రధాన కార్యదర్శి రజని, సభ్యులు శివలత, పద్మ, స్వాతి, శోభారాణి, స్వాతి తదితరులు ఉన్నారు.

అండగా ఉంటా.. అధైర్యపడొద్దు

సిద్దిపేటఅర్బన్: మండలంలోని పలు బాధిత కుటుంబాలను మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు పరామర్శించారు. బక్రిచెప్యాల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ యువజన నాయకుడు మొర్రిబాబు తండ్రి అనారోగ్యంతో మృతి చెందారు. అలాగే ఎన్సాన్‌పల్లి మాజీ ఎంపీటీసీ బొల్లం యాదగౌడ్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాల సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. అలాగే సీనియర్ నాయకుడు ఎర్రవెల్లి శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతున్న విషయం తెలుసుకొని ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య పరిస్థితి తెలుసుకున్నారు. అధైర్య పడవద్దని, అండగా ఉంటానని, ధైర్యంగా ఉండాలని భరోసానిచ్చారు. ఆయన వెంట మాజీ ఎమ్మెల్సీ ఫారుఖ్ హుస్సేన్, సుడా మాజీ చైర్మన్ రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు రాధాకృష్ణశర్మ, రవీందర్‌గౌడ్, ప్రశాంత్, ఎల్లం, కమలాకర్‌రావు తదితరులు ఉన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

కోహెడ(హుస్నాబాద్): స్థానిక సాంఘిక సంక్షేమ పాఠశాలకు చెందిన విద్యార్థులు బి.యశ్వాంత్, ఎల్.రఘునాథ్, జె.యశ్వాంత్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ లక్ష్మణ్‌రావు, పీడీ అరవింద్, పీఈటీ ప్రవీణ్ విద్యార్థులను అభినందించారు.

వాచ్ ఉమెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

మిరుదొడ్డి(దుబ్బాక): మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఖాళీగా ఉన్న వాచ్ ఉమెన్ పోస్టు భర్తీ కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంఈఓ ప్రవీణ్‌బాబు తెలిపారు. పదోతరగతి పాసైన వారు అర్హులని, ఆసక్తి కలిగిన వారు 7వ తేదీ నుంచి, 11వ తేదీ వరకు స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో దరఖాస్తులను అందజేయాలని సూచించారు. ఎంపికైన వారికి నెలకు రూ.8,710 గౌరవ వేతనంగా ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు.

రోడ్లపై ధాన్యం పోయొద్దు

గజ్వేల్‌రూరల్/చిన్నకోడూరు(సిద్దిపేట): రైతులు రోడ్లపై ధాన్యం పోసి ప్రమాదాలకు కారణం కావద్దని సీఐ సైదా సూచించారు. గజ్వేల్‌లో బుధవారం ఆయన మాట్లాడుతూ ధాన్యం రోడ్లపై పోయడం వల్ల వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని, రాత్రివేళల్లో వాహనదారులు కుప్పలపై పడి ప్రాణాలను కోల్పోతున్నారని చెప్పారు. చిన్నకోడూరు పరిధిలోని మాచాపూర్, గంగాపూర్, మెట్‌పల్లి గ్రామాల్లో రోడ్లపై ధాన్యం ఆరోబోసే రైతులకు ఎస్‌ఐ బాలకృష్ణ అవగాహన కల్పించారు.

భవిష్యత్తే లక్ష్యంగా విద్యను అభ్యసించాలి

డీఐఈఓ రవీందర్‌రెడ్డి



జగదేవ్‌పూర్(గజ్వేల్): డీఐఈఓను సన్మానిస్తున్న అధ్యాపకులు

జగదేవ్‌పూర్(గజ్వేల్): విద్యార్థులు తమ భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని విద్యను అభ్యసించి ఉత్తమ ఫలితాలను సాధించాలని డీఐఈఓ రవీందర్‌రెడ్డి సూచించారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి మాట్లాడారు. విద్యార్థుల భవిష్యత్‌కు ఇంటర్మీడియెట్ తొలిమెట్టు అన్నారు. శతశాతం లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. ప్రిన్సిపాల్ రాజన్న, అధ్యాపకులు శ్రీలత, విజయ్, శ్రీదేవి, శ్రీధర్, శ్రీనివాస్, మోహన్‌దాసు, స్వామి, రాజు, నరసింహారెడ్డి, ప్రసాద్ పాల్గొన్నారు.

సామర్థ్యాలు పెంపొందించాలి

కొండపాక(గజ్వేల్): విద్యార్థుల సామర్థ్యాలు పెంపొందించేలా కృషి చేయాలని మండల విద్యాధికారి సత్తయ్య సూచించారు. కుకునూరుపల్లి మండలంలోని కోనాయిపల్లి వడ్డెర కాలనీ, కాశనగర్ ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించి, విద్యాబోధన, మధ్యాహ్న భోజనం గురించి విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. కోనాయిపల్లిలోని ప్రాథమిక పాఠశాలలో స్కావెంజరు పోస్టు నియామకం విషయంలో నలుగురు ఉపాధ్యాయులతో గొడవ పడ్డారు. అమ్మ ఆదర్శ కమిటీ సభ్యుల నిర్ణయం మేరకే నియామకం జరుగుతుందని ఎంఈఓ నచ్చజెప్పారు. హెచ్‌ఎంలు ఉషాలత, పద్మ, రాజేశ్వర్‌రావు, సీఆర్పీ సంతోష్ పాల్గొన్నారు.

హోరాహోరీగా హ్యాండ్ బాల్ పోటీలు

మద్దూరు(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ ఎస్‌జీఎఫ్ అండర్ 19 జిల్లా హ్యాండ్ బాల్ ఎంపికలు హోరాహోరీగా జరిగాయాని ఫిజికల్ డైరెక్టర్ దామెర ప్రేమ్‌కుమార్ తెలిపారు. 110 మంది క్రీడాకారులు పాల్గొన్నారని, అందులో బాలురు 20, బాలికలు 20 మంది ఎంపికయ్యారని చెప్పారు. ఎంపికైన వారు 8 నుంచి 10వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. మల్లేశం, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

పర్మినెంట్ చేయాలంటూ ధర్నా

సిద్దిపేటరూరల్: పంచాయతీ కార్మికులను పర్మినెంట్ చేయాలని, వారి సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట బుధవారం నిర్వహించి డీఎల్‌పీఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వమే ప్రత్యేక గ్రాంటు విడుదల చేసి, కారోబార్, బిల్ కలెక్టర్లకు స్పెషల్ స్టేటస్ కల్పించాలన్నారు. పంచాయతీ ఉద్యోగ, కార్మికుల సేవలను గుర్తించాలని పర్మినెంట్ చేసి, సమస్యలను పరిష్కరించాలన్నారు. బాల్ నర్సయ్య, కొమురయ్య, మహేశ్, శంకర్, కనకయ్య, ప్రభాకర్, రాజమౌళి, బాలరాజు, బాలనర్సవ్వ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పట్టించుకోని ప్రభుత్వం: ఏఐఎస్‌ఎఫ్

బెజ్జంకి(సిద్దిపేట): రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పట్టించుకోవడంలేదని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంగెం మధు ఆరోపించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బుధవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడ్జెట్‌లో 15 శాతం నిధులు కేటాయిస్తామని చెప్పి కేవలం 7 శాతం కేటాయించారని, రీయింబర్స్‌మెంట్, ఫీజుల బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. నాయకులు మహేశ్, సంజయ్, ఉమేశ్ చంద్ర, రాఘవేంద్ర, మమత, నవ్య తదితరులు పాల్గొన్నారు.

దొంగతనం కేసులో నిందితుడికి రిమాండ్

సిద్దిపేటరూరల్: ఆటోను దొంగిలించిన నిందితుడికి 14రోజులు రిమాండ్ విధించినట్లు రూరల్ ఎస్‌ఐ అపూర్వరెడ్డి బుధవారం తెలిపారు. ఆమె కథనం ప్రకారం.. ఇర్కోడ్ గ్రామానికి చెందిన మండల గోపికి చెందిన ఆటోను మంగళవారం గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించినట్లు ఫిర్యాదు అందింది. దీంతో దర్యాప్తు చేసిన పోలీసులు ఆటోను దొంగిలించిన మాట్ల రాజును పట్టుకున్నారు. అతడి నుంచి ఆటోను రికవరీ చేసి, రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు.

బైకు దొంగ అరెస్టు

గజ్వేల్‌రూరల్: బైకు దొంగను అరెస్టుచేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ సైదా తెలిపారు. బుధవారం ఆయన వివరాలు వెల్లడించారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం రావెల్లికి చెందిన దండు ఠాగూర్ గజ్వేల్ పరిధిలోని మూడు బైకులను, గౌరారం, దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రెండు బైకులను దొంగిలించినట్లు తెలిపారు. అందిన సమాచారం మేరకు నిందితుడిని బుధవారం తూప్రాన్‌లో పట్టుకుని ఐదు బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సిబ్బంది ముత్యం, యాదగిరి, నవీన్, రవి, స్వామి, వెంకటేశ్‌ను ఏసీపీ పురుషోత్తం రెడ్డి అభినందించారు.

సత్ప్రవర్తనతో మెలిగితే సహకారం: సీఐ

సిద్దిపేటకమాన్: సత్ప్రవర్తనతో మెలిగే వారికి ఎల్లప్పుడూ పోలీసుల సహకారం ఉంటుందని వన్‌టౌన్ సీఐ వాసుదేవరావు చెప్పారు. తమ పరిధిలో ఉన్న రౌడీ షీటర్ల ఇళ్లను బుధవారం ఆయన సందర్శించారు. ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని సత్ప్రవర్తనతో మెలగాలన్నారు. భూ కబ్జాలు సెటిల్‌మెంట్లలో తలదూర్చినా, అల్లర్లకు పాల్పడినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

గుర్తు తెలియని వ్యక్తికి గాయాలు

సిద్దిపేటకమాన్: ఆగి ఉన్న బస్సును ఢీ కొనడంతో గుర్తు తెలియని వ్యక్తికి గాయాలైన ఘటన సిద్దిపేట పట్టణ శివారులో చోటు చేసుకుంది. టూటౌన్ సీఐ ఉపేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. లింగారెడ్డిపల్లి శివారులో ఆగి ఉన్న బస్సును గుర్తు తెలియని వ్యక్తి తన ద్విచక్ర వాహనంతో ఢీ కొట్టాడు. దీంతో అతడికి తీవ్ర గాయలు కాగా సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి, మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ గాంధీ ఆసుపత్రికి తరలించారు. అతడి వయసు 30 నుంచి 35 యేళ్లు ఉంటుందన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ కూరగాయాల సాగుపై అవగాహన సదస్సు

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలోని కుందనవానిపల్లి ప్రభుత్వ పాఠశాలల్లో గురువారం కూరగాయల సాగుపై శాస్త్రవేత్తల అవగాహన సదస్సు ఉంటుందని వ్యవసాయ అధికారులు తెలిపారు. సాగు విధానం, సబ్సిడీపై అందించే పరికరాల గురించి వివరిస్తారని తెలిపారు.

◆ పదవి విరమణ సహజం

ప్రశాంత్ నగర్(సిద్దిపేట): ఉద్యోగ నిర్వహణలో పదవి విరమణ సహజమని ఏకలవ్య ఎరుకల(వెల్ఫేర్) సంఘం, సిద్దిపేట అధ్యక్షుడు కెమ్మసారం రాజేశ్‌ఖన్నా అన్నారు. జిల్లా కేంద్రంలోని ఏకలవ్య సంక్షేమ భవనంలో గౌరవ అధ్యక్షులు పోచయ్య, మురళి, ఎల్లయ్య, దుర్గయ్యతో కలిసి ఆర్టీసీ డ్రైవర్‌గా పదవి విరమణ పొందిన కెమ్మసారం ఎల్లయ్య రాజమణి దంపతులను బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో నర్సింహులు, నాగరాజు, ముత్తయ్య, రాజు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

◆ డీఈఓకు వినతి

మద్దూరు(హుస్నాబాద్): వల్లంపట్ల ప్రాథమికోన్నత పాఠశాలకు ఉపాధ్యాయులను కేటాయించాలని కోరుతూ జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్‌రెడ్డికి కో-ఆపరేటివ్ సొసైటీ జిల్లా డైరెక్టర్ ఆలేటి యాదగిరి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి దాసరి ప్రశాంత్ బుధవారం వినతి పత్రం అందజేశారు. వారి వెంట రవీందర్, రవి, సాధిక్ తదితరులు ఉన్నారు.

◆ స్వయం ఉపాధి పొందడం అభినందనీయం

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని పోతారం (ఎస్)లో స్వశక్తి మహిళలు స్వయం ఉపాధితో వ్యాపార రంగంలో రాణించడం అభినందనీయమని మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి అన్నారు. బుధవారం పోతారం(ఎస్)లో మహిళలు నిర్వహిస్తున్న టైలరింగ్, పేపర్ ప్లేట్స్, క్లాత్ బ్యాగ్స్ తయారీ పరిశ్రమలను పరిశీలించారు. ఆయన వెంట సీపీఐ నాయకులు మల్లేశ్, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

◆ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

వర్గల్(గజ్వేల్): రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సత్తాచాటాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి మోహన్‌రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గౌరారంలో పార్టీ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డికి బుధవారం క్రియాశీలక సభ్యత్వం కల్పించి మాట్లాడారు. సభ్యత్వ నమోదులో నియోజకవర్గం ముందుండాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాములు, మనోహర్‌యాదవ్ పాల్గొన్నారు.

◆ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

గజ్వేల్: గురుకుల విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడే విధంగా కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తోందని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ కేసీఆర్ హయాంలో భద్రంగా ఉన్న గురుకులాలు నేడు భయాందోళన కలిగిస్తున్నాయన్నారు. పాము కాటు, కరెంట్ షాక్, ఫుడ్ పాయిజన్ వంటి ఘటనలతో విద్యార్థులు ఆసుపత్రుల పాలవుతున్నారన్నారని వాపోయారు.